


తారకరత్న మృతి తీరనిలోటు

కేంద్ర మాజీమంత్రి అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

తారకరత్న అకాల మరణం నందమూరి కుటుంబానికి, టిడిపికి తీరనిలోటును మిగిల్చిందని కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరంతో తారకరత్నకు ఎనలేని సంబంధం ఉందని తెలిపారు. సినిమాలతోపాటు అనేక ప్రజాసేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కనకల మురళీమోహన్, మండల అధ్యక్షులు బి.నర్సింగరావు, కంది మురళీనాయుడు, రామారావు, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ఎల్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



మరడపాలెం గ్రామం ఖాళీ చేయడంతో ఇల్లు గల్లంతై స్థలం ఇవ్వక అభాగ్యురాలైన తెచ్చి లక్ష్మి

సెంటు భూమి లేకపోయినా ఊరు ఉందనే నిబ్బరం.. ఉపాధి కోసం వలసపోయినా చెప్పకోవడానికి ఒక గ్రామం ఉందనే భరోసా.. ముక్కుపచ్చలారని పిల్లలు, ముసలి ముడగను వదిలి పొట్టకూటి కోసం వలసపోయినా గ్రామస్తులున్నారనే నమ్మకం.. అదే నమ్మకంతో జీవనోపాధి కోసం చాలా దూరప్రాంతాలకు వెళ్లినా, పండగలు, ఇతర శుభకార్యాలకు ఎంతో సంతోషంగా వచ్చివెళ్లేవారు. కానీ, నేడా పరిస్థితి తలకిందులైంది. ఉన్న గుడిసె కాస్తా ఎయిర్‌పోర్టు పేరిట పాలకులు లాగేసుకున్నారు. ఊరు కాస్తా దూరంగా వెళ్లిపోయింది. కానీ, అక్కడ అందరితోపాటు ఉండేందుకు ఇల్లు, వాకిలి ఇవ్వలేదు. చెప్పకోవడానికి ఊరే లేదు. వలసపోతే ముసలీ ముడగను ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితి. ఇదీ భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు మాటున భూమిలేని నిరుపేదలు, వలస కూలీలు, వృత్తిదారుల దుస్థితి.

వలస కార్మికులు, వృత్తిదారులకు భరోసా ఏదీ?

నిలువ నీడలేక పరాయి పంచల్లో బతుకీడుస్తున్న ఎయిర్‌పోర్టు నిర్వాసితులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/భోగాపురం

భోగాపురం ఎయిర్‌పోర్టు కోసం సుమారు 2700 ఎకరాల భూమిని సేకరించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలను అధికార యంత్రాంగం బలవంతంగా ఖాళీ చేయించింది. భూములు, ఇళ్లు, చెట్లకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు ప్రతి కుటుంబానికి 5 సెంట్ల స్థలం, రూ.9.50 లక్షల చొప్పున మొత్తం నాలుగు గ్రామాల్లోని 367 కుటుంబాల వారికి (ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ) చెల్లించారు. ఈ గ్రామాల్లో, ముఖ్యంగా మరడపాలెంలోని వలస కూలీలు, వృత్తిదారులు ఇళ్ల స్థలాలు, రూ.9.50 లక్షల (ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ)కు నోచుకోలేదు. ఇలా సుమారు 34 కుటుంబాల వరకు ఉన్నాయంటూ సాక్షాత్తూ అధికారులు, ఇటు అధికారపార్టీ నాయకులే చెబుతున్నారు. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని ప్రతిపక్ష పార్టీకి చెందిన స్థానిక ఎంపిటిసి సభ్యులు 'ప్రజాశక్తి'కి చెప్పారు. వాస్తవానికి వీరంతా భూములు లేని నిరుపేదలు, వృత్తిదారులు. కుటుంబ పోషణ కోసం ఉభయగోదావరి జిల్లాల్లో వ్యవసాయ పనులు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో భవన నిర్మాణ, తదితర పనుల కోసం నిత్యం వలస పోతుంటారు. అక్కడ సంపాదించుకున్న డబ్బుతో పుట్టిపెరిగిన ఈ గ్రామాల్లో కాలం వెళ్లదీస్తుంటారు. వీరు 2015లో భూసేకరణ సమయంలో స్థానికంగా లేకపోవడం వల్ల గుర్తింపునకు నోచుకోలేదు. ఇటీవల గ్రామాలు ఖాళీ చేయించడంతో చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్టుగా వీరంతా చెల్లాచెదురయ్యారు. చుట్టుపక్కల ఊళ్లలో తాత్కాలికంగా తలదాచుకుంటున్నారు.

యువతకు ప్యాకేజీ లేదా?

వాస్తవానికి ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం భూములు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు 18 ఏళ్లు నిండిన వారందరికీ పునరావాసం కల్పించాలి. చివరికి గుడిసెలు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చినప్పటికీ, ఆయా కుటుంబాల వారికి ఇళ్ల స్థలం, ప్యాకేజీ ఇవ్వలేదు. ఇటీవల ఈ గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పినా కేవలం గుర్తింపు కార్డుల సాకుతో అనర్హత వేటుపడిన అభాగ్యులు సంగతి ఎక్కడా ప్రస్తావించలేదు. దీంతో, బాధితులంతా విస్తుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు తమకు న్యాయం చేస్తామన్న అధికారులు ఇప్పుడు నోరు మెదపడం లేదని వాపోతున్నారు. మరడపాలెంలో 11 కుటుంబాలకు రేషన్, ఆధార్ కార్డులు వంటి అన్ని ఆధారాలున్నా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయలేదు. 2015లో తయారు చేసిన జాబితాను అమలు చేయడంతో నిర్వాసిత గ్రామాల్లో చాలామంది యువతీ, యువకులు నష్టపోయారు. ఇటువంటి వారందరికీ కనీసం 3 సెంట్లు ఇస్తామన్న అధికారులు ఇప్పుడు నోరు మెదపడం లేదని బాధితులు వాపోతున్నారు.

జన జాతర

మహాశివరాత్రి జాతరకు జనం పోటెత్తారు. రెండోరోజు ఆదివారం పుణ్యగిరి, రామతీర్థం ఆలయాలకు వేల సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. పుణ్యగిరికి వెళ్లే మార్గమంతా ప్రజలతో కిక్కిరిసింది. రామతీర్థంలో రోడ్లన్నీ జనంతో కిటకిటలాడాయి.



నెల్లిమర్ల.. రామతీర్థం ఆలయం వద్ద యాత్రికులు

తప్పని డోలీ మోత



బాలింతను డోలీలో తీసుకెళ్తున్న ఎఎన్ఎం పార్వతి, ఆశా వర్కర్ లక్ష్మి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయాయి. అమృత్ మహోత్సవ్ పేరుతో ఏడాదిపాటు సంబరాలు కూడా చేసుకున్నాం. కానీ పాలకుల తీరుతో గిరిజనుల బతుకులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే చందంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మారడం లేదు. అత్యవసర సమయాల్లో గిరిశిఖర గ్రామాల గిరిజనులు ఆస్పత్రులకు వెళ్లడం సాహసమే అవుతోంది. డోలీ మోతే శరణ్యమవుతోంది. అలాంటి ఘటనే ఆదివారం మండలంలో పునరావృతమైంది.

శృంగవరపుకోట పట్టణ శివారున కిలోమీటర్ దూరంలో ఉన్న గిరిశిఖర గ్రామం గుడిలోవలో నివశిస్తున్న జన్ని మంగ అనే మహిళ నెలలు నిండక ముందే శనివారం తెల్లవారుజామున మగబిడ్డను ప్రసవించింది. కడుపునొప్పితో బాధపడుతున్నట్లు ఆదివారం ఉదయం ఆమె భర్త ఎస్.కోటలో ఉన్న ఎఎన్ఎం పార్వతిదేవికి సమాచారం అందించారు. హుటాహుటిన ఎఎన్ఎం, ఆశావర్కరు లక్ష్మి అక్కడికి చేరుకుని, ప్రాథమిక వైద్యం అందించారు. మరింత మెరుగైన వైద్యం కోసం స్థానిక సిహెచ్‌సికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కానీ, ఆస్పత్రికి తీసుకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేదు. దీంతో ఎఎన్ఎం, ఆశా.. ఇద్దరూ డోలీ కట్టి ఆ గిరిజన మహిళను కొండ దగ్గర నుంచి కిందికి మోసుకువచ్చారు. మహ శివరాత్రి కావడం ఆ గ్రామంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వైద్య సిబ్బంది కష్టపడి డోలీ మోశారు. కిందికి తీసుకొచ్చే సరికి ఆమెకు నయం కావడంతో ఎఎన్ఎం, ఆశావర్కర్ మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి వైద్యం అందించారు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు.



జెఎన్‌టియు పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిఐజి హరికృష్ణ, ఎస్‌పి దీపిక

ఎస్ఐ రాతపరీక్ష ప్రశాంతం

కేంద్రాలను పర్యవేక్షించిన డిఐజి, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి) ఆధ్వర్యంలో ఎస్ఐ ఉద్యోగ నియామకాలకు జిల్లాలో ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 10 కేంద్రాల్లో 8,458మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కావల్సి ఉండగా పేపరు-1కు 7,744మంది, పేపరు-2కు 7,741మంది అభ్యర్థులు హాజరయ్యారు. నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యేకంగా పోలీసు సిబ్బందితో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసి, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు మార్గ నిర్దేశం చేశారు. లెండి, జెఎన్‌టియు పరీక్షా కేంద్రాలను విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో ప్రాథమిక పరీక్ష నిర్వహించే 10 కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను ఎస్‌పి.. డిఐజికి వివరించారు. అనంతరం పోలీసు అధికారులకు డిఐజి పలు భద్రతాపరమైన సూచనలు చేశారు. జెఎన్‌టియు, సీతం, ఎజిఎల్, మహారాజా అటానమస్, భాష్యం, శ్రీ చైతన్య, ఎంవిజిఆర్, లెండీ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి దీపిక స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థుల సౌకర్యార్థం పోలీసుశాఖ ఆధ్వర్యంలో జెఎన్‌టియు జంక్షన్ వద్ద రెండు బస్సులను ఏర్పాటు చేశారు. వీటిని ఎస్‌పి జెండా ఊపి ప్రారంభించారు. రాతపరీక్ష నిర్వహణలో డిఎస్‌పిలు ఆర్.శ్రీనివాసరావు, ఎల్.మోహనరావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎల్.శేషాద్రి, సిఐలు జి.రాంబాబు, బి.వెంకటరావు, సిహెచ్.లక్ష్మణరావు, ఎస్.కాంతారావు, విజయనాథ్, టివి తిరుపతిరావు, ఎం.వి.గణేష్, పి.పైడపునాయుడు, బి.వి.జి.ప్రసాదరావు, బి.వి.జె.రాజు, ఎం.బుచ్చిరాజు, బి.వి.వెంకటేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, డి.నవీన్ కుమార్, సిహెచ్.స్వామినాయుడు, బి.భాస్కర రావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొని, కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు.

20 నుంచి పోస్టల్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం డివిజన్‌లోని పోస్టల్ కార్యాలయాల్లో 20 నుంచి 24వ తేది వరకు పొదుపు ఖాతాల ఓపెనింగ్ మేళా నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీసుల్లో తెరిచిన పొదుపు ఖాతాలకు ఎక్కువ వడ్డీ ఇస్తున్నారని తెలిపారు. దాచుకొన్న సొమ్ము భద్రంగా ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపికి మరిశర్ల గుడ్‌బై!

ప్రజాశక్తి-బొబ్బిలి



మరిశర్ల రామారావు

వైసిపి సీనియర్ నాయకులు, కౌన్సిలర్ మరిశర్ల రామారావునాయుడు ఈ నెల 23న అధికార పార్టీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయనున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. వైసిపి ఆవిర్భావం నుంచి బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాలను ఆయన ప్రథమ స్థానంలో నిలిపారు. అప్పట్లో ఎంపి విజయసాయిరెడ్డి చేతుల మీదుగా రామారావు ప్రశంసాపత్రం కూడా అందుకున్నారు. వైసిపిలో బొబ్బిలి రాజులు చేరడంతో మరిశర్ల రామారావు ఆ పార్టీకి దూరమయ్యారు. 2019 ఎన్నికల ముందుకు తిరిగి వైసిపిలో చేరిన మరిశర్ల రామారావునాయుడు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విజయానికి ఎంతో కృషి చేశారు. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఆశించి, వైసిపి నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించారు. మున్సిపల్ చైర్మన్ పదవి రాకపోవడంతో అప్పటి నుంచి పార్టీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వస్తున్నారు. వైసిపిలో మరిశర్లకు ప్రాధాన్యత తగ్గడంతో పార్టీ సభ్యత్వానికి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై తన వార్డు పరిధిలోని నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీలకు చెందిన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఈ నెల 23న బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు బోగట్టా. మరిశర్ల దూరమైతే పట్టణంలో వైసిపికి నష్టం తప్పదనే చర్చ సాగుతోంది.

'వెనుకబడిన ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం జరుగుతోంది. వ్యవసాయం, వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో తగిన పురోగతిలేదు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. రెగ్యులరైజేషన్ చేయక ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక వెతలు పడుతున్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ అమలు చేయడంలేదు. ఎన్ఎడిబి ఇతర నిర్వాసిత సమస్యలు పరిష్కరించడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో జిఒ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగాల భర్తీ చేయడంలేదు. ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దుచేయలేదు. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కష్టకాలంలో ఆదుకొనేందుకు సంక్షేమబోర్డు వంటివి లేవు. ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రజల బాధనూ, ఘోషనూ, ఆవేదననూ, వివక్షనూ శాసనమండలిలో గొంతెత్తి పోరాడుతున్న శక్తులకు అండగా నిలబడతాను. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను' అని సామాజిక కార్యకర్త, 250 పైచిలుకు ప్రజా సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఎన్నికల అజెండా, విజయం సాధిస్తే కేంద్రీకరించి పనిచేసే అంశాలను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

- ప్రజాశక్తి, అనకాపల్లి ప్రతినిధి

- సిపిఎస్ రద్దుకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కృషి
- గిరిజన ప్రాంతంలో జిఒ 3 చట్టబద్ధతకు పోరాటం
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముందుంటా..
- 'ప్రజాశక్తి'తో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ



ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం



? ఉన్నత చదువులు చదివి, ఉద్యోగావకాశాలను వదులుకొని సామాజిక సేవను ఎందుకు ఎంచుకున్నారు ?

మా కుటుంబ నేపథ్యం అటువంటిది. గ్రామీణ వాతావరణంలో పెరగడం, చదువు పూర్తయ్యాక గిరిజన, నగర, శ్రామిక మహిళల సమస్యలను అధ్యయనం చేస్తూ, పరిష్కారం కోసం పనిచేశాను. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో అగ్రికల్చర్ బిఎస్సీ పూర్తిచేశాక పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతంలో పనిచేశాను. కొండల్లో గిరిజనుల నివాసాలు, వారి భాషలు, సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతిపైనా ఆసక్తివుండడంతో గిరిజన ప్రాంతం ఎంచుకున్నాను. గిరిజన గూడెల్లో వారితోపాటు ఉంటూ జీడి మామిడి తోటల పెంపకంపై అవగాహన కల్పించడం, వారితో కలిసి తోటలు పెంపకంలో భాగస్వామి అయ్యాను. గుమ్మలక్ష్మీపురం ప్రాంతంలో నాణ్యమైన జీడిపిక్కల విత్తనాల కోసం పెద్ద పోరాటం నడిపి, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయించగలిగాను. 'మేనేజ్' అనే సంస్థ ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులో రంపచోడవరంలోని గిరిజన ప్రాంతంలో పనిచేసినప్పుడు గిరిజన వ్యవసాయంలో చిరుధాన్యాల పంటలకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేశాను. వివాహ రీత్యా విశాఖ నగరానికి రావడంతో.. ప్రభుత్వ ఉద్యోగం కాకుండా, పేదలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల్లో పనిచేయాలని అనుకున్నాను.

? మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలేంటి?

వ్యవసాయం, వ్యవసాయ పనిచేస్తున్న వారితోవున్న అనుబంధం, అన్నయ్య, అక్క, తమ్ముడు విద్యార్థి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాల్లోనూ పనిచేయడం, దీనికితోడు బొబ్బిలి మండలం నారసింహునిపేట సర్పంచ్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన మా తాతగారు మర్రాపు పోతినాయుడు ప్రభావం నాపై బలంగా పడింది. బాల్యంలో ఆయన దగ్గర పెరగడం, చదవడంతో దళితులు, ఇతర సామాజిక తరగతులను ఆయన ప్రేమగా, సమానంగా చూడ్డం అతిసమీపం నుంచి చూశాను. ఉపాధ్యాయులు బాగుంటే, పిల్లలకు విద్యాబోధన బాగుంటుందని ఉపాధ్యాయుల పట్ల చాలా అభిమానం చూపేవారు. నా బాల్యం నుంచే ప్రభావితం కావడానికి ఇవన్నీ దోహదపడ్డాయి.

? మీరు చేపట్టిన ప్రధాన సేవా కార్యక్రమాలేంటి?

వివాహరీత్యా విశాఖ నగరానికి రావడంతో జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ధాన్ ఫౌండేషన్'లో రెండు దశాబ్దాలకుపైగా పనిచేశాను. నా ఆలోచనలకు తగినట్లే పేదరిక నిర్మూలన, రైతులు, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేసే క్రమంలో 33 వేల మంది పేద మహిళలతో స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా సమాఖ్యలను ఏర్పాటు చేశాను. ఈ క్రమంలో బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ సంస్థలు, ఆరోగ్య సంస్థలు, వృత్తి శిక్షణా సంస్థలతో అనుసంధానం చేసుకొని పేద మహిళలకు, వారి కుటుంబాలకు సేవలందించాను. అంగన్‌వాడీ, ఆశా, శ్రామిక మహిళలు పనిచేసే ప్రాంతంలో వారెదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా పనిచేశాను. మెటర్నిటీ లీవ్ సదుపాయం, లైంగిక వేధింపుల కమిటీలు, ప్రత్యేక మరుగుదొడ్లు వంటి ఏర్పాటు చేయగలిగేలా చేశాను. ఎస్ఇజెడ్‌లో గార్మెంట్ కార్మికుల సమస్యలపై పనిచేసినప్పుడు భారత ప్రతినిధిగా ఆసియా దేశాల్లో వారి సమస్యలపై మాట్లాడాను. నా జీవిత భాగస్వామి డాక్టర్ బి.గంగారావు ప్రజలకు సేవచేసే వ్యక్తి కావడంతో నా సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాను. 2010 నుంచి మురికివాడల్లోని పేద కుటుంబాల పిల్లల కోసం వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ (విసిసి) ఏర్పాటుచేశాను. పిల్లల్లో సమిష్టితత్వం పెంచడం, సామాజిక స్పృహ, శాస్త్రీయ ఆలోచనలు వారిలో పెంపొందించడం సంతృప్తినిచ్చాయి. పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నాం.

? మీరు విజయం సాధిస్తే ఏ సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తారు?

నా అభ్యర్థిత్వాన్ని బలపర్చి పనిచేస్తున్న 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజాసంఘాల సమస్యలు పరిష్కారానికి, ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీకి కృషి చేస్తాను. విభజన చట్టం హామీల అమలుకు కృషిచేస్తాను. పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీ పూర్తికి, మెట్రో రైల్, రైల్వే జోన్‌పై మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా జరుగుతున్న పోరాటాలకు అండగా వుంటాను. సొంత గనులు సాధనకు కృషి చేస్తాను. సిపిఎస్ రద్దుకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు అండగా వుంటాను. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీకి కృషి చేస్తాను. సెజ్‌లో పరిశ్రమలకు రాయితీలు కల్పించినట్లు, ఉపాధి కేంద్రాలుగావున్న చిన్నచిన్న విద్యా సంస్థలకు రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరుతాను. గిరిజన ప్రాంతంలో జిఒ 3 ప్రకారం ఉద్యోగాల భర్తీచేయాలి. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసేలా పట్టుబడతాను. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తాను. విశాఖలో పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తాను. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై ఉత్తరాంధ్ర ఆడపడుచుగా నీతి, నిజాయతీ, నిబద్ధతతో మండలిలో పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాను.

? ఎన్నికల ప్రచార అజెండా ఏంటి?

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే ప్రధాన ప్రచార ఎన్నికల అజెండా. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిలో ఈ ప్రాంతం వెనుకబడివుంది. వ్యవసాయం అభివృద్ధి చెందకపోవడంతో వెనుకబాటుతనం కొనసాగుతోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీ అమలుచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చిన్ననీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి. కొత్త పరిశ్రమలు రావాలి. ఐటి హబ్‌ని అభివృద్ధి చేయాలి. ఇవి కాకుండా అనేక సమస్యలు సుదీర్ఘకాలంగా వున్నాయి. వీటన్నింటినీ పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్తున్నాను.

బాలికల ఖోఖో విజేత విజయనగరం

ద్వితీయ స్థానంలో బాలుర జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నం జిల్లా భీమిలిలో సెయింట్ ఆన్స్ స్కూల్లో 17, 18, 19 తేదీల్లో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో చిత్తూరు జట్టుపై 11-9 స్కోరుతో విజయం సాధించింది. ఫైనల్లోకి వెళ్లిన బాలుర జట్టు విశాఖపట్నం జట్టు చేతిలో ఒక్క పాయింట్ (6-5) తేడాతో ఓటమి పాలైంది. రన్నర్‌గా నిలిచింది. రాష్ట్ర విజేత, రన్నర్‌గా నిలిచిన జిల్లా బాలికలు, బాలుర జట్లతోపాటు కోచ్, మేనేజర్లు కె.గోపాల్, బి.మల్లికార్జున్, బి.శ్రీనివాసరావు, ఎం సీతమ్మను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్‌వి రమణ, ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింత సత్యనారాయణ అభినందించారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాలుర జట్టు



విజేతగా నిలిచిన జిల్లా బాలికల జట్టు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఉత్తరాంధ్ర అభివృద్ధికి పనిచేస్తా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

బొబ్బిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి పనిచేస్తానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ తెలిపారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లోనూ వెనుకబడిందన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా ఇవ్వలేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ రూ.24 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నా కేంద్రం రూ.450 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తున్నా రాష్ట్రంలో వైసిపి, టిడిపి అడ్డుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో జిఒ 3ను రద్దు చేయడం గిరిజనులకు అన్యాయం చేయడమేనని చెప్పారు. విశాఖ రైల్వేజోన్, మెట్రోరైల్, సుజలస్రవంతి, గిరిజన యూనివర్సిటీ హామీలు గాలికి వదిలేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. అరకొర పిఆర్‌సి అమలు చేసి ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికుల సమస్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రశ్నిస్తున్నారని గుర్తుచేశారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆమె పట్టభద్రులకు విజ్ఞప్తిచేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సభ్యులు జి.సామినాయుడు, ఎ. శ్రీనివాసరావు, బి.రమేష్, పి.సత్యనారాయణ, ఎం.శోభనబాబు, కె.రామకృష్ణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొంప వెంకటరావు

నాయకులకు తొత్తులుగా పోలీసులు

వేపాడ : రాజకీయ నాయకులకు పోలీసులు పాలికాపుల్లా కాపలా కాస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు విమర్శించారు. ఆదివారం బానాదిలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు పోలీసు శాఖ తొత్తుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష నాయకులు పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొనే అవకాశం ఉన్నప్పటికీ ప్రతిపక్ష నాయకుడు ప్రజలతో మాట్లాడకుండా పోలీసు శాఖ వ్యవహరించడం వైసిపికి అడుగులకు మడుగులు వత్తడమేనన్నారు. చంద్రబాబు పాదయాత్రకు అడ్డంగా రోడ్డుపై పోలీసులు బైఠాయించడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారన్నారు. రాజకీయ నాయకులు అధికారం ఐదు సంవత్సరాలకే మాత్రమేనని పరిమితమన్న విషయాన్ని పోలీసు శాఖ గుర్తించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, జనపరెడ్డి ఈశ్వరరావు, మంచిన అప్పల సూరి, ముక్క రామకృష్ణ, సిరికి రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచారం

డెంకాడ : మండలంలోని వెదుళ్లవలస, అమకాం గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో అభియాన్ (చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం) కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తెలుగు సూరిబాబు, నాయకులు రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చందులూరులో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

లక్కవరపుకోట : మండలంలోని చందులూరు గ్రామ పంచాయతీలో శ్రీ త్రయంబకేశ్వర స్వామి పేరంటాలు తీర్థ మహోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు కిషోర్ యువసేన సభ్యులు శనివారం నిర్వహించారు. స్థానిక ఎంపిటిసి యద్ద కిషోర్ కుమార్ ప్రారంభించిన క్రీడలో విజయనగరం విశాఖపట్టం జిల్లాల చెందిన 38 జట్లు పాల్గొన్నాయి. మార్చి 3 వరకు జరుగనున్న ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతిగా రూ. 10వేలు, రెండో బహుమతిగా రూ. 6వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు ఇవ్వనున్నట్లు కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యద్ద సత్యారావు, గ్రామ పెద్దలు యద్ద నాయుడు, సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయిలో పారిశుధ్య పనులు

వేపాడ : మండలం లోని సింగరాయి గ్రామంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులను చేపట్టారు. కాలువల్లో పేరుకు పోయిన మురు గును తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త పోగులను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అనంతరం కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. ఈ కార్యక్రమంలో 8 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారని మరో మూడు రోజులు పాటు గ్రామాన్ని శుభ్రం చేయిస్తామని సర్పంచ్ తెలిపారు.

యువతకు ఆదర్శం ఛత్రపతి

విజయనగరం టౌన్ : పోరాట స్ఫూర్తి, మహిళలను గౌరవించడంలో ఛత్రపతి శివాజీ యువతకు ఆదర్శంగా నిలిచారని వాట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పృథ్వీ కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం వాట్ సంస్థ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మద్దిల సోంబాబు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని విజయనగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యతకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యజ్ఞల చక్రవర్తి, బుద్దేపు వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయికృష్ణా వాకర్స్ శ్రమదానం

విజయనగరం టౌన్ : అయ్యన్న పేట జంక్షన్ వద్దనున్న శ్రీసాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నడక మైదానంలో ఆ క్లబ్ సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. క్లబ్ ఎలక్ట్ ప్రెసిడెంట్ చెల్లూరు శ్రీనివాసరావు ఆధ్వర్యాన మైదానంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని అంతా పోగుచేసి మంటపెట్టారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు, సీనియర్ సభ్యులు జి.గోవిందరావు, వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ, యాగాటి నలమరాజు, ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు, పెనుమత్స అప్పలరాజు, జె.వి.ఎస్.ప్రసాద్, బి.ఎస్.ఎన్.ఎల్. ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి

పాలకొండ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.ఉమామహేష్, జాయింట్ యాక్షన్ కమిటీ పి.ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా పబ్లిక్ సెక్టార్ కాపాడుకోవడానికి సిపిఎస్ రద్దు ఓపిఎస్ పునరుద్ధరణకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగ ఉపాధ్యాయులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ఉత్తరాంధ్ర ఉద్యమాలకు బలపర్చేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల తదితర రంగాల సమస్యలు పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించాలని. గ్రాడ్యుయేట్ ఓటర్లు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

భవిష్యత్తును అంధకారం చేస్తున్న వైసిపి

భామిని : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం భవిష్యత్తును అంధకారంలో నెట్టేసిందని టిడిపి నాయకులు ఆరోపించారు. మండల కేంద్రమైన భామినిలో టిడిపి నాయకులు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యులు, రోజు వారీ కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. వైసిపి వైఫల్యాలను తెలుసుకొని, రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

రెండో రోజు పోటెత్తిన యాత్రికులు

- జనసంద్రంగా మారిన పుణ్యగిరి
- కిటకిటలాడిన రామతీర్థం
- సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు



నెల్లిమర్ల: జాగారం చేస్తున్న యాత్రికులు

ఉత్తరాంధ్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం, దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి ఆలయాలు శివరాత్రిని పురస్కరించుకుని రెండో రోజు కిటకిటలాడాయి. ఈ రెండు ప్రాంతాల్లోనే సుమారు లక్షకుపై గా భక్తులు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. భక్తులు కోసం ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు. దారి పొడువునా భక్తులకు ప్రసాదాలను, అన్నదానాలను, తాగునీటిని సరఫరా చేశారు. మరి కొన్ని చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంతాలను శుభ్రపరుస్తూ కనిపించారు.

ప్రజాశక్తి- నెల్లిమర్ల, శృంగవరపుకోట

ఉత్తరాంధ్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానం రెండో రోజు ఆదివారం శివరాత్రిని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి శనివారం రాత్రే చేరుకుని జాగారాలు చేశారు. వారంతా ఆదివారం తెల్లవారు జామున కోనేటిలో స్నానాలు చేసి ఉమాసదాశివాలయంతో పాటు, శ్రీరాముని సన్నిదిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి శ్రీ ఉమా కోటి లింగేశ్వర ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి జాగారం చేసిన భక్తులు ఆదివారం వేకువజాము నుండే పుణ్య గిరి కొండకు చేరుకోవడంతో కొండ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. సీఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బందితో కిందకు వచ్చే భక్తులకు ఒకే మార్గం కాకుండా కొండపైకి వెళ్లేందుకు మెట్లమార్గం, కిందికి వచ్చేందుకు పుణ్యగిరి కొండపైకి రహదారి కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్గం గుండా భక్తులు కిందకు దిగేలా ఏర్పాటు చేశారు.

ఉమా కోటిలింగేశ్వరని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వేర్వేరుగా పుణ్యగిరి కొండ పైకి వెళ్లి శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పుణ్యగిరిలో యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన చక్కెర పొంగలి భక్తులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెంట పుణ్య గిరి ఉత్సవ కమిటీ చైర్మన్ పోలమర శెట్టి రామకృష్ణ, ఫోక్స్ డైరెక్టర్ వాకాడ రాంబాబు వైసిపి నాయకులు ఉన్నారు. పుణ్యగిరి కొండపై గల చంద్రభారతి మహాలక్ష్మి నాయుడు బాబా నిత్య అన్నదాన ఆశ్రమంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.



వేపాడ: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



ఎస్‌కోట: ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమెల్యే కడుబండి

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

మహాశివరాత్రి సందర్భంగా పుణ్య గిరికి వచ్చే భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు తరించాయి. విజయదుర్గ జెసిబి, క్రేన్, ట్రాక్టర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండపైన మహాలక్ష్మి నాయుడు బాబా నిత్య అన్నదాన ఆశ్రమంలో పుణ్య గిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం ఆహార పదార్థాలను అందజేశారు.వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదం అందజేశారు. స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పులిహోరా, మజ్జిగ అందజేశారు. అవతార్ బాబా ఆశ్రమం భక్తులు పుణ్యగిరికి వచ్చే యాత్రికులకు భోజన ఏర్పాట్లను చేశారు. గణేష్ జ్యువెలర్స్, మల్ల జ్యువెలర్స్ పులిహోర పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పుచ్చకాయ ముక్కలను అందించారు. రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహోర, మజ్జిగ, మంచి నీటిని పంపిణీ చేశారు. రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిబ్బంది యాత్రికులకు పులిహోర, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. మండల ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు, మజ్జిగ, ప్రసాదం అందజేశారు. నాయి బ్రాహ్మణులు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాల్ని నిర్వహించారు.

వేపాడ: మండలంలో మహాశివరాత్రి సందర్భంగా బానాది, కొండ గుళ్ళు, సోంపురం, వల్లంపూడి గ్రామాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

సంగమేశ్వర ఆలయం వద్ద అన్నదానం

వంగర: మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం నీలానగరం గ్రామానికి చెందిన వావిలపల్లి బాబు పురుషోత్తమరావు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ ఆలయం వద్ద వారం రోజులు పాటు జాతర జరుగుతుంది. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు ఆకలితో వెల్ల కూడదనే ఉద్దేశంతో ఈనెల 18 నుంచి జరుగుతున్న జాతరలో పురుషోత్తమరావు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది యాత్రికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 24 వరకు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు.



ఎస్.కోట..కొండపైకి ఎక్కుతున్న భక్తులు

రోజువారీ మార్కెట్ కష్టాలు

- ఏళ్లుగా వీడని ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని పాలక వర్గం
- మార్కెట్ ఆదాయం పైనే పంచాయతీ శ్రద్ధ

ప్రజాశక్తి - జామి

ఒకప్పుడు వయా జామి మీదుగా వెళ్ళాలంటే బీమసింగి రైల్వే గేటు వద్ద గేటు పడితే ఇబ్బందని ఆలోచించేవారు. దీంతో అక్కడ వంతెన నిర్మించి రైల్వే గేటు సమస్యకు స్వస్తి పలికారు. కానీ జామి ప్రధాన రహదారిని మాత్రం రైల్వే గేటుకు మించిన సమస్య పట్టి పీడిస్తోంది. మండల కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల వరకు నిర్వహిస్తున్న రోజూ వారి మార్కెట్ నిర్వహణ, వాహన చోదకులకు, అత్యవసర పనులపై వెళ్ళిన ప్రజానీకాన్ని ముప్పు తిప్పలు పెడుతుంది. గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం మాత్రమే కాదు...ప్రమాదకర పరిస్థితుల్లో వాహనాలు మార్కెట్‌ను దాటాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యం లోనే కష్టబడి పండించిన కాయగూరలు అమ్ముకోవడానికి రైతులు, రహదారి గుండా ప్రయాణం చేయాల్సిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా మార్కెట్ ద్వారా లక్షల ఆదాయం పొందుతున్న పంచాయితీ అధికారులు, పాలక వర్గం మాత్రం మార్కెట్ నిర్వహణకు సురక్షితమైన స్థలం కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని చెప్పక తప్పదు. ఇప్పటికే అనేక మార్లు మార్కెట్ వ్యవహారంపై పంచాయితీకి పిర్యాదులు అందాయి. పత్రికల్లో వార్తా కథనాలు వెలువడుతున్నాయి. కానీ పాలకుల్లో మాత్రం ఇసుమంతైనా చలనం లేకపోవడం దురదృష్టకరం.



ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాలు

జామి మేజరు పంచాయితీ రోజూ వారి మార్కెట్ నిర్వహణ ఏళ్లుగా వివాద స్పదంగా నడుస్తోంది. గతంలో గ్రామంలో వారపు సంత కేంద్రంగా మార్కెట్ నిర్వహణ జరిగేది. అయితే గతం కన్నా రైతాంగం పెద్దఎత్తున కాయగూరలు పంటలు విస్తృతం చేయడంతో జిల్లాలోనే రామభద్రపురం తర్వాత రెండవ కాయగూరలు పండించే ప్రాంతంగా జామి రైతాంగం ఉన్నారు. అయితే పండించిన పంట అమ్ముకోవడానికి సరియైన మార్కెట్ అవసరం. ఈ నేపథ్యంలోనే జామి మండల కేంద్రంలో ప్రతి రోజూ మార్కెట్ నిర్వహిస్తున్నారు. కానీ మార్కెట్ నిర్వహణకు సరియైన స్థలం ఏర్పాటు చేయడంలో పంచాయితీ విఫలమవుతోందని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపైనే మార్కెట్ నడుస్తోంది. ఫలితంగా రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే నరకయాతన పడాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల విశాఖ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులతో భారీ వాహనాలు రద్దీ ఎక్కువైంది. దీంతో మార్కెట్ నిర్వహణ ప్రమాదకరంగా మారింది. గంటల తరబడి ట్రాఫిక్ నిర్భందం సంగతి అటుంచితే, ఏ వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటు చేసుకుంటుందో అన్న భయాందోళన ఎక్కువైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అత్యవసర చికిత్సలు అందాల్సిన రోగులు 108 వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని నిలిచిపోతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించి మార్కెట్‌కు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నారు.

ఏళ్లుగా తాత్సారం

గతంలో ప్రజాశక్తి పలు మార్లు మార్కెట్ నిర్వహణకు స్థలం కేటాయించాలని కథనాలు ప్రచురించింది. దీంతో గతంలో మండల పెద్దల చొరవతో వారపు సంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, మార్కెట్‌కు శాశ్వత పరిస్కారం చూపేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ ఏడాది కావస్తున్నా, ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా రోజు వారి మార్కెట్ నిర్వహణకు అటు రైతులు, ప్రజలకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని పెద్ద ఎత్తున ప్రజల నుంచి డిమాండ్ వినిపిస్తుంది.

స్థల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి స్టేట్ బ్యాంక్ ఎదురుగా కోపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేయడానికి ఆదివారం స్థల పరిశీలన చేశారు. జిల్లాలో ఆరు కోపరేటివ్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి రూ. 2వేల కోట్లు లావాదేవీలు జరపడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఇప్పటికే ఆరు బ్రాంచుల్లో మూడు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడానికి స్థలం సిద్ధంగా ఉందని, వేపాడ మరో రెండు బ్రాంచ్‌లు ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్నామని సిఇఒ ఆర్ జనార్ధన్ తెలిపారు. ఈ పరిశీలనలో డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామనాయుడు, ఎజిఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద ఆదివారం ఎఎస్ఐ శ్రీనివాసరావు వాహనాలు తనిఖీలు చేపట్టారు. మితిమీరిన వేగం వెళ్లరాదని ఓవర్ లోడ్ వేయరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన చోదకులకు చెప్పారు. పరిమితి మించిన ప్రయాణికులు ఎక్కించడంతో ఆపరాద రుసుం వేశారు. లైసెన్సు సి-బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెంట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులను తనిఖీ చేశారు.

అభివృద్ధికి నోచుకోని కుమిలి కాలువ

- ప్రతిపాదనలకే పరిమితమైన ఆదునికీకరణ - 16వేల ఎకరాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల వద్ద ఉన్న కుమిలి కాలువ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఫలితంగా రైతులకు సకాలంలో నీరందక ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నెల్లిమర్ల చంపావతి నది మధ్యలో నారాయణపట్నం వద్ద పెద్ద గట్టు కట్టి నీటిని మళ్లించి నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ మండలాల రైతులకు నీరందించాలని ప్రభుత్వం అక్కడ కుమిలి కాలువను నిర్మించింది. నది మధ్యలో నుంచి నీటిని ఈ కాలువకు మళ్లించి తద్వారా 16వేల ఎకరాలకు సాగునీటిని అందించాలన్నది ఈ కాలువ లక్ష్యం. అయితే సుమారు 10కిలోమీటర్ల పొడువున్న ఈ కాలువ ఎక్కడికక్కడ పూడికలతో నిండిపోవడం, పిచ్చిమొక్కలు పుట్టిక రావడంతో సాగునీటి సక్రమంగా రైతులకు అందే పరిస్థితి లేదు. ఈ విషయాన్ని అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కొంత మంది రైతులు వారి పొలాల వద్ద ఉన్న కాలువను శుభ్రం చేసుకునే ప్రయత్నం చేసినప్పటికీ సుదీర్ఘంగా ఉన్న కాలువలో ఎక్కడికక్కడ మొక్కలు పుట్టడంతో నీరు సరిగా అందక సాగునీటి కష్టాలు పడుతున్నారు.



మొక్కలతో పూడికపోయిన కాలువ

ప్రతిపాదనలకే ఆదునికీకరణ పనులు

ఈ మూడు గ్రామాలకు సాగునీటినందించే ఈ కాలువ ఆదునికీకరణ పనులు చేపట్టాలని ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నప్పటికీ పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. గతేడాది మాత్రం ఆయా గ్రామాల పరిధిలోని గ్రామస్తులు ఉపాధి హామీలో భాగంగా కాలువను బాగు చేసుకున్నారు. అయితే వారి పరిధిలో ఉన్న కాలువను మాత్రమే బాగుచేయడంతో మిగతా ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలు, పూడికలు అలాగే ఉండిపోవడం వల్ల సాగునీరు దిగువ వరకూ అందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మొత్తం కాలువంతటినీ ఒకేసారి బాగు చేయించడంతో పాటు కాలువను మరింత లోతుగా తయారు చేస్తేనే దిగువకు నీరందే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఆ దిశగా ఆదునికీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మధ్యలో నిలిచిన భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బికె నాయుడుపేట కస్తూరిబా బాలికల వసతి గృహానికి అదనపు భవనాల నిర్మాణానికి జిల్లా సమగ్ర సర్వ శిక్ష అభియాన్ నుంచి నిధులు మంజూరయ్యాయి. పనులను కొంత కాలంగా కాంట్రాక్టర్ జోరుగా చేసినా ఇటీవల పనులు మొత్తం ఆపేశారు. చేసిన పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో ముందుకు వెళ్లే పరిస్థితి లేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. భవనానికి బయట తూతూ మంత్రంగా రంగులు వేసినా లోపలి భాగంలో మాత్రం గోడలకు ప్లాస్టింగులు, కరెంటు వైరింగ్, టైల్స్ వంటి పనులు చేపట్టలేదు. దీనిపై కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా చేసిన పనులకు పూర్తిగా బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు నిలిపివేశామన్నారు. ఒకవేళ పెట్టుబడి పెట్టి మిగిలిన పనులను పూర్తి చేయాలని ఉన్నప్పటికీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందో లేదో తెలియని పరిస్థితిల్లో పనులను నిలిపేశామన్నారు. దీంతో విద్యార్థులు ఎప్పటి మాదిరిగానే ఇరుకు గదిలోని చదువులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి చేసిన పనులకు బిల్లులు మంజూరు చేసి అదనపు గదుల నిర్మాణానికి సహకరించి తమకు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



మధ్యలో నిలిచిపోయిన భవనం లోపలి భాగం పనులు

సాహిత్య చరిత్రే రచనకు పునాది

రాజాం: ఆయా ప్రాంతాల సాహిత్య చరిత్రను రచించి నిక్షిప్తం చేస్తే చరిత్రకు ఆధారాలు అందించినట్టేనని సాహితీ రత్నాకర, సాహిత్య వాచస్పతి డాక్టర్ దామెర వెంకట సూర్యారావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక ఎనిమిదవ వార్షికోత్సవం జరిగింది. ఆ సందర్భంగా జరిగిన సభలో వెంకట సూర్యారావు 'విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనుమరుగై పోయిన కళింగాంధ్ర కవుల, రచయితల సాహిత్యాన్ని ఈ పుస్తక రూపంలో తీసుకొని రావడం వల్ల భావితరాలకు ఈ నేలలో పుట్టిన సాహిత్యం గురించి అవగాహన వస్తుందని అన్నారు. ఇలాంటి సాహిత్య చరిత్రల వల్లనే ఆయా నేలల అసలు చరిత్ర తయారవుతుందని చెప్పారు. ఒక ప్రాంతీయ అస్తిత్వాన్ని నిలపాలంటే ఆ ప్రాంతంలోని సాహిత్యాన్ని కూడా వెలికి తీయడం, వర్తమాన సాహిత్యాన్ని గ్రంథస్థం చేయడం చేయాలని అన్నారు. గొప్ప సాహిత్య కళింగాంధ్రలో పుట్టిందన్నారు. వెనుకబడిన కళింగాంధ్రలో ఇలాంటి ప్రయత్నాలు జరిగితే కళింగాంధ్ర అస్తిత్వం నిలుపుకోవడమే కాకుండా ఇతర సమాజానికి ఇక్కడి ఘనత తెలియజేసిన వారమవుతామని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం రచయితల వేదిక సభ్యులు వెంకట సూర్యారావుని సన్మానించారు. రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కణుగుల సుధీర్, అట్టాడ అప్పలనాయుడు, గంట్యాడ గౌరునాయుడు, తుర్లపాటి రాజేశ్వరి, రామవరపు వెంకట రమణమూర్తి, డాక్టర్ గార రవి ప్రసాద్, సూర్య శైలజ, గార సీతారత్నం, పిల్లా తిరుపతిరావు, మూడడ్ల శ్రీనివాసరావు, ఆల్తి మోహన్‌రావు, పొదిలాపు శ్రీనివాసరావు, పొట్నూరు కోటిబాబు, పెంకి చైతన్య కుమార్, గురుగుబిల్లి జగన్నాథ రావు, వెలుగు రామినాయుడు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య..!

- భర్తే చంపేశాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- అనాథలైన చిన్నారులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఢికొల్లం పంచాయతీ రెడ్డి పేట గ్రామంలో బుట్ట ఉష (22) ఆదివారం ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె భర్త కొట్టి చంపేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లిదండ్రుల వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లక్ష్మీపురం పంచాయతీ నేదురుపేట గ్రామానికి చెందిన బట్టు ఉషాను డెంకాడ మండలం డి కొల్లాం పంచాయతీ రెడ్డికి పేట గ్రామానికి చెందిన బుట్ట ఆదినారాయణకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి దీక్షిత్ (3), యశ్వత (1) ఉన్నారు. భార్య భర్తలు ఇద్దరూ నిత్యం గొడవ పడుతుండే వారని తమ కుమార్తెను మద్యం సేవించి నిత్యం కొడుతూ చిత్ర హింసలు పెట్టేవాడని వాపోయారు. పెద్దల సమక్షంలో చాలాసార్లు మందలించినా అతను తీరు మార్చు కోలేదన్నారు. ఆదివారం కూడా మద్యం సేవించి విచక్షణ రహితంగా తమ కుమార్తెను భర్త ఆదినారాయణ కొట్టిచంపేసి ఉరివేసాడని ఆరోపించారు. కుమార్తె తలపై మెడపై గాయాలు ఉన్నాయన్నారు. కుమార్తె చనిపోవడంతో వారి పిల్లలు అనాథలయ్యారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త ఆదినారాయణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృత దేహన్ని జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



అనాధులైన చిన్నారులు

వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విజయనగరంటౌన్ : బాలికల కోసం నిర్వహిస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర వసతి గృహాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు.. అధికారులను ఆదేశించారు. నగరంలోని సుంకరివీధిలో నిర్వహిస్తున్న ఎస్‌సి బాలికల వసతిగృహం-2, 3ను ఆదివారం ఆయన సందర్శించారు. బాలికలకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ త్వరలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా బద్ధంగా బాలికలు చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఆరోగ్యంగా, భద్రతగా ఉండాలని చెప్పారు. ఇటీవల కాలంలో వసతిగృహాల్లో ఆహారం బాగోలేక బాలికలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. పరిచయం లేని ఇతరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహంలోకి కుటుంబ సభ్యులు తప్ప మిగిలిన వారిని అనుమతించరాదని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సంక్షేమ అధికారి రామానందం, వసతిగృహ సంక్షేమాధికారులు రాధామణి, నాగమణి పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- రాజాం

స్థానిక మెంతి వీధికి చెందిన దేవులపల్లి వెంకటేష్ (25) అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఇతను జనవరి 19 నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు 23న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఫిబ్రవరి 18న గోపాలపురం రోడ్డు సమీపంలో చెరువు అంచున తుప్పల్లో వెంకటేష్ మృత దేహం కనిపించింది. స్థానికులు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని వెంకటేష్‌గా గుర్తించారు. అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహన్ని గ్రామానికి తరలించి ఆదివారం దహనసంస్కారాలు చేశారు.